హైదరాబాద్ వార్త



# చెరువు చిన్నబోయింది

**మహానగరంలో చెరువులు, కుంటలకు పట్టణీకరణ శాపంగా పరిణమిస్తోంది. ఔటర్‌రింగ్ రోడ్డుకు లోపలున్న సుమారు 3,500 చెరువులు, కుంటల విస్తీర్ణం భారీగా తగ్గుముఖం పడుతోంది. ఆయా జలవనరులకు సంబంధించిన భూములు కబ్జాకు గురవడం, ఎఫ్‌టీఎల్‌కు ఆనుకొనే విల్లాలు, రియల్ వెంచర్లు, బహుళ అంతస్తుల భవంతులు వెలియడంతో విలువైన జలాశయాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టి రోజురోజుకూ చిన్నబోతున్నాయి.**

హైదరాబాద్, జనవరి 27 ప్రభాతవార్త : విలువైన జలవనరులు ఇలా అన్యాక్రాంతం కావడంపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఔటర్‌కు లోపల చిన్న పెద్ద చెరువులు, కుంటల సంఖ్య 3,500 కాగా..వీటి విస్తీర్ణం 2005లో సుమారు 30,978 ఎకరాలుగా ఉండేది. ఆ తర్వాత రియల్ రంగం పురోగమించడం, పొరుగు రాష్ట్రాలు, దేశాల నుంచి ఉద్యోగాలు, వ్యాపారాల కోసం సిటీకి వలసలు అధికమవడంతో శివార్లలో రియల్ రంగం జోరందుతుంది. ఇదే క్రమంలో అక్రమార్కుల కన్ను విలువైన జలాశయాలపై పడింది. జీవో 111 పరిధిలో ఉన్న గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిబంధనలకు విరుద్ధంగా విల్లాలు, రియల్ వెంచర్లు, వాణిజ్య స్థలాలు బహుళ అంతస్తుల భవంతులు వెలిసి ఒకప్పుడు పచ్చటి పంట పొలాలు, నిండుకుండలను తలపించే చెరువులు, కుంటలతో కళకళలాడిన ప్రాంతాలు ఇప్పుడు కాంక్రీట్ మహారణ్యంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా జలవనరుల విస్తీర్ణం ఇప్పుడు మిగతా సిటీ 3వ పేజీలో



పోటీలో విజేతలైన విద్యార్థులకు ట్రోఫీని అందజేస్తున్న జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని, సత్యగౌర చంద్రదాస

2లో



ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి ప్రత్యంగిరా మహాయజ్ఞంలో పాల్గొన్న గవర్నర్ తమిళసై

**కాళీ కాలభైరవ కళ్యాణంతో సమాజంలో అరిష్టాలు తొలుగుతాయి**
గవర్నర్ తమిళసై 3లో



బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలో శనివారం ఎన్‌సిసి పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

2లో

# గ్రేటర్‌పై కాంగ్రెస్ నజర్

## నాలుగింట్లో మూడైనా దక్కించుకునేలా ప్రణాళికలు

**ఇప్పటికే మంత్రులకు పార్లమెంట్ ఇంచార్జ్‌ల నియామకం**

**నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్న దీపా దాస్‌మున్షీ**

**గ్రేటర్ సీట్లను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధిష్టానం**

**పార్టీకి ప్రతిష్టాత్మకమే.. గ్రేటర్ పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గాలకు అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. మొత్తం నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో మూడింటి లో పాగా వేయాలని భావిస్తుంది. అయితే నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 29అసెంబ్లీ సెగ్మెంట్లలో కేవలం మూడింటిలో మాత్రమే కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉండగా..మిగతా సెగ్మెంట్‌లకు బిఆర్‌ఎస్ ప్రాతినిధ్యం వహిస్తుంది. హైదరాబాద్ లోకసభ పరిధి లో గోషామహాల్ మినహా మిగతా వాటిలో మజ్లిస్ ప్రాతినిధ్యం కలిగి ఉంది. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో బిఆర్‌ఎస్ ప్రాతినిధ్యం ఉండగా.. చేవెళ్ల పరిధి లో కేవలం మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉంది. మిగతా సెగ్మెంట్లలో బిఆర్‌ఎస్ ప్రాతినిధ్యం కలిగి ఉంది. దీంతో అధకార కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి.**



హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగినా..మహానగర పరిధిలోని అన్ని స్థానాల్లో పరాభవం తప్పలేదు. తెలంగాణ అవిర్భావం అనంతరం గత ప దేళ్లుగా అసెంబ్లీ, జిహెచ్ ఎంసి ఎన్నిక ల్లో పరా భావానికి గుర వుతూ వస్తూంది. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు సైతం నిరాపర్చాయి. ఈనేపత్యంలో గ్రేటర్‌పరిధిలోని లోక్‌సభా స్థానాలపై కాంగ్రెస్ దృష్టిసారించింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో నాలుగింటిలో కనీ సం మూడింటిని దక్కించుకునేలా వ్యూహాలు రచిస్తుంది. ఇప్పటికే ఆపార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీరంగంలోకి దిగి పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా మైనారీ వర్గాలతో సమావేశం నిర్వహించి చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించినా కారణంగా ..పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి పొరపాట్లు జరగకుండా ముందు జాగ్రత్తలకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే టిపిసిసి పొలిటికల్ ఎఫైర్ కమిటీ (పిఏసి) పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంచార్జ్‌లను కూడా నియమించింది. సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీసిఎం బట్టి రెండేసి నియోజకవర్గాలకు బాధ్యతలను, మిగిలిన వారికి ఒక్కో నియోజకర్గ బాధ్యతలను అప్పగించారు. ఇందులో రేవంత్‌రెడ్డి గ్రేటర్ పరిధిలోని చేవెళ్ల స్థానంతోపాటు మరోనియోజక వర్గానికి ఇంచార్జ్‌గా.. డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క సికింద్రాబాద్ హైదరాబాద్, నియోజక వర్గాలకు ఇంచార్జ్‌గా నియమించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు బాధ్యతలు అప్ప గించారు.

అలాగే గతంలో పార్టీని విడిన వారిని తిరిగి చేర్చుకుని లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని యోచిస్తున్నారు. ఇండియా కూటమిలో ఎంబిటి చేరితే దానికి హైదరాబాద్ పార్లమెంట్ స్థానం వదిలి మిగతా స్థానాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తుంది. అందుకోసం సినీయర్ నాయకులైన మంత్రులకు పారన్లమెంట్ స్థానాలకు ఇంచార్జ్ లుగా భాద్యతలు అప్పగించింది.





# ఉప్పల్ టెస్టుకు పోటెత్తిన అభిమానం

**మూడ్రోజులుగా జనసంద్రాన్ని తలపిస్తున్న మైదానం**

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: భారత్ -ఇంగ్లాండ్ తొలిటెస్టుకు ఆతిథ్యమిస్తున్న ఉప్పల్ మైదానంలో మూడ్రోజులుగా పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు ఆదరణ తగ్గుతున్న తరుణంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈటెస్టు మ్యాచ్‌కు ఎన్నడూలేని విధంగా అభిమానులు పోటెత్తారు. హైదరాబాద్ ఆతిథ్యమిచ్చిన తొమ్మిది టెస్టుల్లో ఎన్నడూ 20వేలకు మించి ఫ్యాన్స్ స్టేడియంకు రాలేదు. అయితే, జగన్‌మోహన్‌రావు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్టుకు మిగతా సిటీ 3వ పేజీలో

# ఖరీదైన బైకులతో కుర్రకారు హల్‌చల్

**రోడ్లపై వేగంగా దూసుకెళ్తూ హడలెత్తిస్తున్న రైడర్లు**

**ప్రాణాంతక విన్యాసాలతో స్టంట్లు**

**మితిమీరినవేగంతో ప్రమాదాలు**



హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త : కావాల్సినంత డబ్బు.. ఖరీదైన కార్లు ,బైక్‌లు..జీవితాంతం తిన్నా తరగని ఆస్తిపాస్తులు. కాని వారి అలవాట్లు మితిమీరిన వేగం ప్రాణాలమీదుకు వస్తున్నాయి. తను కోరిందే తడవుగా కోట్లు ఖర్చుపెట్టి మరీ ఖరీదైన బైక్‌లు, కార్లు ఇంటి ముందు పెడుతున్నారు. కుమారులకు హితవాక్యాలు చేప్పే సమయం తీరిక వివిఐపిలకు లేదు. వారు అడిగింది తెచ్చి ఇచ్చి తమ డ్యూటీ అయిపోయిందనే భావిస్తున్నారు. కొందరు రాజకీయాలు, వ్యాపారాలు, సినిమాలు ఇలా బిజి జీవితాలు గడుపుతున్న విఐపిలకు తమ కుటుంబ సభ్యులు యాక్సిడెంట్లు, హఠాత్మరణాలు కోలుకోలేని షాక్‌కు గురిచేస్తున్నాయి. కొందరు మద్యం తాగి ప్రమాదానికి గురైతే ..మరికొందరు మితిమీరిన వేగంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై కొందరు ఆకతాయిలు చేసే ప్రమాదకర స్టంట్లతో మిగతా వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. బైక్ రేస్‌లతో పక్క నుంచే అతివేగతంగా దూసుకెళ్తూ భయాందోళనకు గురిచేస్తున్నారు. మరికొందరైతే పోలీసులు గుర్తించకుండా నెంబర్ ప్లేట్ లేని బైక్‌లపై వెళ్తుండడం నిత్యకృత్యమైంది. తమ పిల్లలను అదుపులో పెట్టకుండా తల్లిదండ్రులు గారాబం చేయడంతో ఇంకా రెచ్చిపోతున్నారు. కొందరు ఆకతాయిలు బైక్‌లపై విన్యాసాలు, సర్కస్ ఫీట్లు చేస్తూ పక్కన వెళ్లేవారిని పరేషాన్ చేస్తున్నారు.

**ఒక్కోబైక్‌పై ముగ్గురు..** ఇద్దరు వెళ్లాల్సిన బైక్‌లపై ముగ్గురు, నలుగురు కూర్చొని ప్రయాణిస్తుండడం ఇటీవల పరిపాటిగా మారింది. ప్రమాదమని తెలిసినా పట్టించుకోవడంలేదు. ఔటర్ రింగ్‌రోడ్, నెక్లెస్ రోడ్డు, బంజారాహిల్స్, గచ్చిబౌలి తదితర విశాలమైన ప్రదేశాల్లో నైట్ రైడింగ్, నైట్ రేసింగ్, స్టంట్ రైడింగ్, వీలింగ్, స్టీపీ, బర్న్ ఔట్, హై చేర్, 12 ఓ క్లాక్, రోలింగ్ స్టాఫీ వంటి విన్యాసాలు చేస్తున్నారు. వీరిని అదుపు చేయాల్సిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హైస్పీడ్ స్పోర్ట్స్ బైక్‌లు కొనిచ్చిన తల్లిదండ్రులకు తమ పిల్లల బైక్ విన్యాసాలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. బైక్ రైడర్లలో లైసెన్సు లేని వారి సంఖ్య 50 శాతానికిపైగా ఉంటుందని తెలిసి కూడా పోలీసులు,ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రేటర్‌లో ఉదయం ఐదు గంటలకు మొదలు కొని రాత్రి 11 గంటల వరకు రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాల నుండి, నగర శివారు ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి వెళ్తుంటారు. ఆర్టీసి బస్సులు, కారు ,, ఆటోలు, ప్రైవేటు వాహనాలతో బిజీబిజీగా ఉండే రోడ్లపై యువత చేసే బైక్ విన్యాసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్లను సైతం లెక్కచేయకుండా రయ్..రయ్ మంటూ దుసుకెళ్తున్నారు. బైక్‌లపై అతివేగంగా ప్రయాణించేవారిని పట్టుకునేందుకు గతంలో ప్రత్యేక బృందాలు, స్పీడో మీటర్లు ఉండేవి. కానీ అవి ప్రస్తుతం అవి కనిపించకుండా పోయాయి. ఛేజింగ్ చేస్తున్న సమయంలో రైడర్లు ప్రమాదానికి గురైతే తామే బాధ్యులమవుతామని పోలీసులు కూడా ఒక్కోసారి వదిలేస్తున్నారు. ఈనేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌కు పరిమితం కాకుండా యువత స్పీడుకు కళ్లెం వేయాల్సి ఉంది.

# నేతలకు నిబంధనలు వర్తించవా..?

**దుండిగల్ మున్సిపాలిటీలో భారీగా అనుమతుల్లేని షెడ్లు**

**కౌన్సిలర్లు, నాయకులవే అగ్రభాగం**

**ఫిర్యాదులు అందిన చర్యలు చేపట్టని అధికారులు**

**కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయం తమ ఖజానాలోకి**



టెక్‌మహీంద్రా సమీపంలో కౌన్సిలర్‌కు చెందిన అక్రమ షెడ్డు

దుండిగల్, జనవరి 27 ప్రభాతవార్త: ప్రభుత్వ నిబంధనలు పారదర్శకంగా అమలు చేయాల్సిన ప్రజా ప్రతినిధులు, నాయకులే అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనలు ఏమాత్రం లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఒత్తిళ్ళతో కొన్నింటిని మాముళ్ళతో మరి కొన్నింటిని జోరుగా కొనసాగి స్తున్నా రు. అక్రమాలపై పలు ఫిర్యాదులు అందిన మున్సిపల్ అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. నాయకులు అధికారులు ఏకమై కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని తమ ఖాజానాలోకి మళ్ళించుకుంటున్నారని స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలపై అధికారుల ఉదాసీనత వైఖరి, వ్యవహారశైలి స్థానిక ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహాదూర్‌పల్లి టెక్‌మహీంద్రా సమీపంలో కొంత కాలంగా పదుల సంఖ్య లో అనుమతుల్లేని భారీ షెడ్ల నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ నిబంధ నలు ఉల్లంఘిస్తూ 400గజాలు మొదలుకొని 1000 గజాలకు పైగా విస్తీర్ణంలో అక్రమ నిర్మాణాలను బాహాటంగానే కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన చర్యలు చేపట్టిన ధాఖలాలు లేకపోగా మమ్మల్ని ఏం చేయమంటారు అంటూ ఎదురు ప్రశ్న రావడంతో ఫిర్యాదుదారుల ఖంగుతినాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అక్రమ నిర్మాణాల్లో అగ్రభాగం కౌన్సిలర్లు, బిఆర్‌ఎస్ నాయకులే కావడంతో అధికారులు అటువైపు వెళ్ళకపోగా అడిగిన వారికి ఉచిత సలహాలు ఇవ్వడం వారి విధి నిర్వాహణకు నిదర్శనంగా పేర్కోనవచ్చు

**నేను కౌన్సిలర్‌ను నాకు నిబంధనలతో పనిలేదు**

బాధ్యతగా వ్యవహారించాల్సిన ఓ కౌన్సిలర్ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యాంగా వ్యహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్దంగా నిర్మా ణాలు చేపట్టడం ఆయనకు పరిపాటిగా మారింది. అధికారులు సైతం తలొగ్గడంతో ఆయన అక్రమ నిర్మాణాలను అడ్డు అదుపు లేకుండా కొనసాగిస్తున్నారు. ఆయనను ఆశ్రయించిన వారిని సైతం ఎటువంటి అనుమతులు అవసరం లేదంటూ లక్షల రూపాయలు దండుకొని అనేక నిర్మాణాలకు సహకరిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం టెక్‌మహీంద్రా సమీపంలో ఆయన మరో భారీ షెడ్డు నిర్మాణం కొనసాగిస్తున్నప్పటికి అధికారులు చర్యలు తీసుకోవడం కాదు కదా అటువైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదు. అదే విధంగా ఆపరిసర ప్రాంతాల్లోనే మరో కౌన్సిలర్, బిఆర్‌ఎస్ నాయకులు చేపట్టిన అక్రమ నిర్మాణాల జోలికి సైతం అధికారులు వెళ్ళకపోవడం గమనార్హం.

**మా దృష్టికి రాలేదు: మున్సిపల్ అధికారులు**

అక్రమంగా కొనసాగుతున్న భారీ షెడ్ల విషయమై మున్సిపల్ అధికారులను అడుగగా మాదృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు. అధికారుల దృష్టికి రానప్పుడు ఆక్యూపెన్సీ, పన్నులు ఎవరు ఇస్తున్నారనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిర్మాణ సమయంలో కళ్ళు మూసుకొని అంతా అయిపోయాక మాకేం తెలియదు అని అధికారులు పేర్కోనడం హాస్యాస్పదం.

**ఉన్నతాధికారులు స్పందించాలి..** బహాదూర్‌పల్లి పరిధిలో కొనసాగుతున్న అక్రమ భారీ షెడ్లపై ఉన్నతాధి కారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ నిబంధనలకు విరుద్దం గా కొనసాగుతున్న నిర్మాణాలపై, అదేవిధంగా అక్రమాలకు సహాకరిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని తమ ఖజానాలోకి మళ్ళించుకుంటున్న బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# మానసిక స్థితి సరిగాలేక వివాహిత ఆత్మహత్య

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 27, ప్రభాతవార్త : మానసిక స్థితి సరిగాలేని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సర్దార్ పటేల్ నగర్‌లో నివసంచే ఆనంతలక్ష్మీ నాగదేవి (29)కి గత పది సంవత్సరాల క్రితం మానసిక స్థితి సరిగా లేదని తెలియజేశారు. నాలుగేళ్ల కుమారుడు నాగదేవి శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసును కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పంజాగుట్టలో కారు బీభత్సం

**స్టేషన్ నుంచి నిందితుడు పరారీ**

హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో కారుతో భీబత్సం సృష్టించిన వ్యక్తి పోలీస్ స్టేషన్ నుంచి పరార్ అయ్యాడు. చార్మినార్ ప్రాంతానికి చెందిన కార్లదొంగ అమీర్ అలీ జూమ్‌యాప్ ద్వారా కారు బుక్‌చేసుకుని కారుతో ఉడాయించాడు. శుక్రవారం రాత్రి కారుతో అమీర్‌పేట్ నుంచి పంజాగుట్ట మెట్రో స్టేషన్‌వైపు పారిపోతున్న అమీర్ అలీని పట్టుకోవడానికి కారు యజమాని ప్రయత్నిస్తుండగా అతివేగంతో అడ్డు వచ్చిన వారిని కారుతో ఢీకొట్టుకుంటూ వెళ్ళాడు. వెంటనే స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించే సమయంలో పోలీసులు కళ్లు కప్పి నిందితుడు పారిపోగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నారు.

# భారతీయ కళాకారులకు విదేశాలలో గుర్తింపు రావటం అభినందనీయం

## శారద కళాక్షేత్ర కూచిపూడి నాట్య అకాడమీ నిర్వాహకులు భావన సతీష్



ఎయిర్‌పోర్ట్‌లో ఘనసత్కారం అందుకున్న నాట్యకళాకారులు



ముషీరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: భారతీయ కళాకారులకు విదేశాలలో సైతం గుర్తింపు రావటం అభినందనీ యమని శారద కళాక్షేత్ర కూచిపూడి నాట్య అకాడమీ నిర్వాహకులు, నాట్య గురువులు భావన సతీష్ కొనియాడారు. హైదర్గూకోట్ లోని శారద కళాక్షేత్ర కూచిపూడి నాట్య అకాడమీ విద్యార్థులు ప్రపంచ ప్రసిద్ధిచెందిన థాయ్‌పూసం ఫెస్టివల్‌లో కూచిపూడి నాట్య ప్రదర్శన ఇచ్చి, శనివారం హైదరాబాద్ చేరుకోవటంతో, ఎయిర్‌పోర్ట్‌లో వారికి ఘన స్వాగతం పలికారు. మలేషియాలో ఘనంగా జరిగే ఈ అంతర్జాతీయ పండుగకు భారత్‌నుండి వెళ్లిన రెండు బృందాలలో వీరు ఒకరు. ప్రపంచ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి, తమ ప్రతిభను చాటారని గురువు భావన సతీష్ హర్షం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా తన దగ్గర నాట్యం నేర్చుకుంటున్న అక్షర దేవళ్ల, మేఘన, నిత్యశ్రీనిధి, నైనిక ఈ ఫెస్టివల్‌లో పాల్గొని నాట్య ప్రదర్శన ఇచ్చారని, రెండు లక్షల మంది పాల్గొన్న ఈ ఫెస్టివల్‌లో అతి పెద్ద మురుగన్ విగ్రహం ముందు విదేశీయుల మధ్య నాట్యం చేయటం గొప్ప వరంగా తమ శిష్యులు భావిస్తున్నారని తెలిపారు.



హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రదర్శనలో హైదరాబాద్ కామిక్ కాన్ 2024 వివిధ వేషాధారణ పాలొన్న అభిమానులు, కళాకారులు



భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పద్మవిభూషణ అవార్డు రావడంతో అభినందనలు తెలుపు తున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ నాయకులు

## వెంకయ్య నాయుడుకు అభినందనలు

యూసుఫ్‌గూడ, జనవరి 27, ప్రభాతవార్త : గణతంత్ర దినోత్స వాలను పురస్కరించుకుని భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డులను ప్రకటించింది. భారత మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడుకు పద్మవిభూషణ్ అవార్డు రావడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, బానుతేజా, చక్రి, ఆజాద్ సయ్యద్‌లు వెంకయ్యనాయుడును కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంత్రికి అభినందనలు



మంత్రి కొండ సురేఖను అభినందిస్తున్న కాంగ్రెస్ నేత మోహన్

కంటోన్మెంట్,జనవరి 27 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొండ సురేఖను సికింద్రాబాద్ లాలాగూడ ప్రాంతానికి చెందిన టీపీసీసీ ఓబిసి ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్, కాంగ్రెస్ నాయకులు మహేందర్, సుందర్‌రాజన్, రజాక్,రాములు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : కొంతం దీపిక



ఈస్ట్ మారేడ్‌పల్లిలో రోడ్డు మరమ్మత్తులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

అడ్డగుట్ట, జనవరి 27 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. శనివారం ఈస్ట్ మారేడ్‌పల్లిలోని రోడ్డు నెం -9లో కొనసాగుతున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీర్లు సుదర్శన్, అంజనేయులు, రవిందర్, శ్రవంతి, శంకర్,ఖాజా తదితరులు పాల్గొన్నారు.

### తప్పిపోయిన పెంపుడు కుక్కను యజమానికి అప్పగించిన పోలీసులు

తార్నాక, జనవరి 27 ప్రభాతవార్త: ఇంటి నుంచి తప్పిపోయిన ఓ పెంపుడు కుక్కను ఆచూకి తెలుసుకొని యజమానికి అప్పగించిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. సితాఫల్ మండి ప్రాంతంలో నివాసముండే జగత్ ఇంటి నుంచి వారి పెంపుడు కుక్క(మార్క్స్) ఉదయం 9 గంటలకు తప్పిపోయింది. దీంతో కుక్క యజమాని జగత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీపుటేజీ సహాయంతో తప్పిపోయిన కుక్కను పార్శిగుట్టలో క్రైం సిబ్బంది రాత్రి 9 గంటలకు పట్టుకున్నారు. పట్టుకున్న కుక్క మార్క్స్‌ను యజమానికి అప్పగించడంతో ఆయన సంతోషం వ్యక్తం చేసి పోలీసులకు కృతజ్ఞతలు చెప్పారు.

## హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 27, ప్రభాతవార్త : కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీలోని శ్రీ నాగార్జున స్టార్ కిడ్స్ విశ్వ విద్యాలయంలో స్కూల్ కరస్పాండెంట్ కమలాకర్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులచే సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ ఫెయిర్ ద్వారా పిల్లలకు సబ్జెక్ట్ మీద అవగాహన పెంచుకునే అవకాశం ఉందని పిల్లలకు స్కూల్ టీచర్స్, పేరెంట్స్ వారికి ఇంట్రెస్ట్ ఉన్న రంగాల్లో ప్రోత్స హించడం ద్వారా వారు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలియజేశారు.

## దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలి

### ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాతపాల్



సుజాత పాల్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 27, ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొని దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికాంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐసీసీ తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్ సూచించారు. టిపిసిసి ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర ్యంలో తెలంగాణలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల 2024 కోసం గాంధీ భవన్‌లో కార్యవర్గ సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐసిసి తెలంగాణ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సూజాత పాల్‌ని పిసిసి వైస్ ప్రెసిడెంట్ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, అధికార ప్రతినిధులు డా.సత్యం,శ్రీరంగం, కాల్వ సుజాత, భవానీరెడ్డి, సంధ్యారెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుజాత పాల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తీసుకోవలసిన చర్యలు, పార్టీ శ్రేణులకు చేయవలసిన దిశా నిర్ధేశాల గురించి వివరించారు.

## శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 27, ప్రభాతవార్త : క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్లో రాజీవ్‌గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం రాజీవ్‌గాంధీ నగర్‌లో క్రికెట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కులాలకు మతాలకు అతీతంగా అందరూ కలికట్టుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ నగర్ అధ్యక్షులు అజీజ్, ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్, యూత్ అసోసియేషన్‌ల్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

యూసుఫ్‌గూడ, జనవరి 27, ప్రభాతవార్త : విద్యుత్ ఫీడర్ల మరమ్మతు, చెట్టుకొమ్మల తొలగింపులో భాగంగా ఈనెల 28 ఆదివారరం విద్యుత్ అంతరాయం ఉంటుందని అల్లాపూర్ విద్యుత్‌శాఖ ఏఈ పేర్కొన్నారు. 33/11 కేవీ అయ్యప్పసొసైటీ సబ్‌స్టేషన్, 11 కేవీ అయ్యప్ప ఫీడర్, 33/11 కేవీ అయ్యప్పసొసైటీ ఎస్ఎస్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదేవిధంగా తాండా స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, షేక్‌కాలనీ, రజకకాలనీ, 11కేవీ హుండాయ్, ఓహెచ్‌ఫీడర్, 33/11 కేవీ అయ్యప్పసొసైటీ ఎస్ఎస్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, జైన్స్ శంకర్ కన్‌స్ట్రక్షన్స్, తపశ్వీమోటర్స్, రెయిన్‌బో హాస్పిటల్, జైహింద్‌కాలనీ, యూసీవీ మోటర్స్, 11కేవీ మైహోం ఫీడర్, 33/11కేవీ అయ్యప్పసొసైటీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాండా కమాన్, 169 నియర్ సీజీఆర్ స్కూల్, అపోజిట్ చాపలపులుసు రెస్టారెంట్, నియర్ పిల్లర్ 815 విద్యుత్ అంతరాయం ఉటుందని పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్‌కు నివాళ్లు



భౌతిక కాయం వద్ద ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

అల్వాల్, జనవరి 27 ప్రభాతవార్త: కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్ రావు అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. అల్వాల్ స్వర్గధామ్‌లో జరిగిన అంత్యక్రియలకు రాజకీయ ప్రముఖులు వివిధ సంఘాలకు చెందిన నేతలు హాజరై మాజీ ఎమ్మెల్యేకు నివాళుల ర్పించారు. మచ్చేందర్ రావు కర్మ కాండలను ఆయన మనువడు నిర్వహించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేశవ్‌రావు, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా టిజెఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దయాకర్ ఇతర ప్రముఖులు అంత్యక్రియలులో పాలు పంచుకున్నారు. తొంభై తొమ్మిది ఏళ్ళ వయసు ఉన్న ఆయన బాత్‌రూములులో జారి పడిన నాటి నుంచి నిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం కున్ను మూశారు. ఆయనకు కొడుకు ఇద్దరు ఆడ బిడ్డలు సంతానం కాగా కొడుకు మరణించడం జరిగింది. 1978 నుంచి 1983 వరకు జనతాపార్టీ తరుపున కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా పని చేశారు. రాజకీయ ప్రముఖుడిగానే కాకుండా అనే సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహించే వారు. బహుముఖ ప్రజ్ఞాశాలిని కోల్పోడం జరిగిందని ప్రముఖులు పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీగా ఎన్నికైన అమీర్ అలీఖాన్‌కు సన్మానం



అప్జల్‌గంజ్, జనవరి 27 ప్రభాతవార్త: తెలంగాణ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన సియాసత్ ఉర్దు ఎడిటర్ అమీర్‌అలీ ఖాన్ తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అద్యక్షులు డాక్టర్.ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో మైనార్టీ అభివృద్ధి,సంక్షేమ పథకాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.గవర్నర్ కోటాలో ప్రొఫెసర్‌కోదండరామ్,అమీర్‌అలీఖాన్‌లను నియమించేందుకుగాను సహకరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మొహమ్మద్ నసీరుద్దీన్,వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణగా సాగిన ఎన్‌సిసి పరేడ్

చిక్కడపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలో శనివారం ఎన్‌సిసి పరేడ్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పారిశ్రామికవేత్త, విద్యావేత్త, విశాఖ ఇండస్ట్రీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం వంశీకృష్ణ హాజరై పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ కార్యదర్శి పి.వి.రమణకుమార్, గడ్డం రోషిణి తదితరులు పాల్గొని వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

## మారేడ్‌పల్లి మున్సిపల్ షెనాయ్ గ్రౌండ్‌లో ఘనంగా స్పోర్ట్స్‌డే వేడుకలు

అడ్డగుట్ట,జనవరి 27 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాలలో ప్రతిభకనబర్చేందుకు టీచర్లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పోస్టర్ బిల్లాబాంగ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ బి.మహేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సునీత రాణిలు తెలిపారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని షెనాయ్ మున్సిపల్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు స్పోర్ట్స్‌డేను నిర్వహించారు. పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో, జంపింగ్, లాంగ్ జంప్ వంటి వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల.. నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం ప్రభావిత ప్రాంతాలలో అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆటో స్టాండ్ బస్టాప్, సోమవారం మార్కెట్, వసంత టూల్స్ యూనిట్2, చిన్న శివాలయం ప్రాంతం, పోచమ్మ దేవాలయం ప్రాంతం, పెద్దమ్మ దేవాలయం రోడ్, పైప్‌లైన్ రోడ్, రమావతి స్కూల్ రోడ్, సుభాష్ నగర్ పారిశ్రామిక ప్రాంతం, భాగ్యలక్ష్మి కాలనీ, వెంకటాద్రి నగర్, గంపల బస్తీలలో విద్యుత్ నిలివేస్తున్నట్లు విద్యుత్ అధికారి ఏఈ పి.ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు.

నిజాంపేట్.. పారిశ్రామిక బొల్లారం ఏరియాలో విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా నేడు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.30 వరకు మమతా హాస్పిటల్, బొల్లారం ఐఎన్‌డిఎల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలివేస్తున్నామని, ఇందుకు ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారి ఏఈ కోరారు.

## అతివేగం అత్యంత ప్రమాదకరం

### ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు

ముషీరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: అతి వేగంతో వాహనాలు నడపటం అత్యంత ప్రమాదకరమని, ఒక్కోసారి అదే అంతిమ ప్రయాణంకు దారితీస్తుందని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, బేగంపేట్ ఏసీపీ జి.శంకర్‌రాజు హెచ్చరించారు. శనివారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవం పురస్కరించుకుని దోమలగూడలోని ఏవీ కళాశాలలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, బేగంపేట్, నెహ్రూయువకేంద్ర సంగతన్, తెలంగాణ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏవీ కళాశాల ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్ సహకారంతో రహదారుల భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువత అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేగం థ్రిల్ ఇస్తుంది కానీ, అది జీవితాన్ని చంపుతుందని, అనేక కుటుంబాలలో ఈ అతివేగమే విషాదాన్ని నిపిందని గుర్తు చేశారు. రహదారులపై క్రమశిక్షణతో వ్యవహరించాలని, అదే మీకు, ఇతర వాహనదారులకు, పాదచారులకు కూడా రక్షణ ఇస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.పద్మ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రిన్స్‌పాల్ వరలక్ష్మి, ఎన్‌వైకేఎస్ జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా, ఇన్‌స్పెక్టర్లు వి.రాంచందర్, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, హెచ్‌జీ అధికారి కృష్ణ, దోమలగూడ పీఎస్ సిబ్బంది, హీరో మోటో శ్రవణ్‌కుమార్ మరియు దాదాపు ఐదు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువకుడు మృతి



శ్రీకాంత్‌సింగ్ (ఫైల్ ఫోటో)

మలక్‌పేట, జనవరి 27 ప్రభాతవార్త: వేగంగా వచ్చిన ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం కాచిగూడ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌సింగ్ స్థానికంగా రౌడీషీటర్, ఇతనిపై సుల్తాన్‌బజార్, లేక్ పోలీస్‌స్టేషన్, చైతన్యపురి పీఎస్ లలో కేసులు ఉన్నాయి. శ్రీకాంత్‌సింగ్ తన ఒళ్ళంతా పచ్చ బొట్లు వేయించుకున్నాడు. ఇతనికి సోషల్ మీడియాలో, ఇన్‌స్టాగ్రామ్‌లో మంచి ఫాలో వర్స్‌ను పెంచుకున్నాడు. కాగా శుక్రవారం రాత్రి చాదర్‌ఘాట్ వద్ద ద్విచక్రవాహనంపై వెళుతున్న శ్రీకాం త్‌సింగ్‌ను వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో శ్రీకాంత్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ముందుంటుంది: మంత్రి పొంగులేటి



రెవెన్యూ, హౌసింగ్, ఇన్ఫర్‌మేషన్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కంజ్యుమర్ రైట్స్ ఫోరం జాతీయ సెక్రటరీ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

యూసుఫ్ గూడ, జనవరి 27, ప్రభాతవార్త : ప్రజా హామీలను నెరవేర్చటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరావు అన్నారు. వెంగళ్‌రావునగర్‌కు చెందిన కంజ్యూమర్ రైట్స్ ఫోరమ్ జాతీయ సెక్రెటరీ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి శనివారం మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ శాలువతో సత్కరించారు. స్వామివారి ప్రసాదములు జ్ఞాపికలను అందజేశారు.

## ఆప్తులకు ఆపన్నహస్తంతో దైవానుగ్రహం



జాతీయ సేవారత్న, నంది అవార్డు గ్రహీతలతో దైవజ్ఞశర్మ, రామసత్యనారాయణ, విజయ్‌కుమార్, సరోజనమ్మ

నాంపల్లి, జనవరి 27 ప్రభాతవార్త : ఎన్నో కష్టనష్టాలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ఆప్తులకు ఆపన్నహస్తం అందించి సహాయసహకారాలు అందిస్తే ఆ భగవంతుడి కరుణ, అనుగ్రహం ఆయా దాతలకు ప్రాప్తిస్తుందని, ప్రార్థించే పెదవులకన్నా సహాయం అందించే చేతులుమిన్న అని సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ అన్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ నాల్గవ వార్షికోత్స వాన్ని పురస్కరించుకొని సమాజంలో అనేకమంది పేదలు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, అలాంటి వారికి తమవంతు సామాజిక బాధ్యతగా సహాయసహకారాలు అందిస్తున్న పలువురు దాతలను దైవజ్ఞశర్మ సినీనిర్మాత రామసత్యనారాయణ, హీరో విజయ్‌కుమార్, కపిల్‌దేవ్, జి.దయానంత్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. ఎస్.సరోజనమ్మ తదితరులతో కలిసి ఘనంగా సత్కరించి నంది, జాతీయ సేవారత్న అవార్డులు అందజేసి ఎంతగానో అభినందిస్తూ ముమ్ముందు అభాగ్యులకు, ఆర్తులకు మరింత సహాయం అందించాలని కోరారు.

## కన్నులపండువగా హారేకృష్ణ సాంస్కృతికోత్సవాలు

### ఏదేశమేగినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరువరాదు

### తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని

రవీంద్రభారతి, జనవరి 27 ప్రభాతవార్త : చదువు, విద్యాసముపార్జన, ఉద్యోగ వ్యాపారాల దృష్ట్యా ప్రపంచంలోని ఏదేశాలకు వెళ్లినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మరువరాదని, కాపాడుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని విద్యార్థులకు సూచించారు. పిల్లలు చిన్ననాటి నుండి తమ ప్రథమ గురువు దైవాలైన తల్లిదండ్రులను, జీవితాన్ని కొనసాగించే విద్యాబుద్ధులు నేర్పించే గురువులను పూజిస్తూ గౌరవించి వారి అడుగుజాడల్లో పయనించాలని, స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. చిన్నతనంలో మెదడులో నాటుకున్న నీతి నియమాలు, మంచే వారిని జీవితాంతం సన్మార్గంలో నడిపిస్తాయని జస్టిస్ స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు భారత రాజ్యాంగం, చట్టాల గురించి సులువైనరీతిలో తెలియజేస్తూ ప్రతీఒక్కరికీ వీటిపట్ల సంపూర్ణ అవగాహన అవసరమని స్పష్టం చేశారు. హారేకృష్ణ ఇంటర్నేషనల్, హారేకృష్ణ గోల్డెన్ టెంపుల్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం ఉదయం హారేకృష్ణ హైదరాబాద్ వార్షిక సాంస్కృతికోత్సవం హెరిటేజ్ ఫెస్ట్ కన్నులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల శాస్త్రీయ సంప్రదాయ జానద నృత్యాలు, నాటకం, శాస్త్రీయ సంగీతం, భగవద్గీత శ్లోకపఠనం, వేదిక్‌క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వం, రంగోలి తదితర కళాప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకొని ఉర్రూతలూగించారు.

## వెంకయ్యనాయుడుకు సత్కారం



వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న ఆకృతి సుధాకర్

సైఫాబాద్, జనవరి 27 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్‌ను మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుకు ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రముఖ ఆకృతి సంస్థ ఘనంగా సత్కరించింది. ఈ మేరకు వెంకయ్యనాయుడు నివాసంలో ఆ సంస్థ అధ్యక్షుడు ఆకృతి సుధాకర్, జూబ్లీహిల్స్ వాసవి క్లబ్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు, ఆకృతి సహ కార్యదర్శి మహేందర్ తదితరులు ఆయన్ని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వెంకయ్య నాయుడుకు పద్మవిభూషణ్ రావడం తెలుగు ప్రజలందరికి లభించిన గొప్ప గౌరవమని తెలుగు ప్రజలంతా పులికించిపోయారన్నారు. ఆయనకు కళలు, కళాకారుల పట్ల ఉన్న గౌరవాన్ని గుర్తు చేశారు.

## కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయండి

### కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్



పార్టీలో చేరినవారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి రమేష్

కెవిహెచ్‌బి కాలనీ, జనవరి 27, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్‌కు చెందిన చున్ను పాషా సొంత గూటికి మళ్ళీ చేరారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్‌ను మియాపూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మరింత అభివృద్ధి చెందే విధంగా చూడాలని కాలనీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని బండి రమేష్ హామి ఇచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని తెలిపారు. మూసాపేట్‌కి చెందిన చున్ను పాషా, వహీద్, లక్ష్మీ కాంగ్రెష్ పార్టీలో చేరారు. కాంగ్రెష్ పార్టీ కండువా కప్పి బండి రమేష్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పోరేటర్ గోపిశెట్టి రఘు, తూము వేణు, సతీష్‌గౌడ్, డివిజన్ ప్రెసిడెంట్, తూము సంతోష్, స్వరూప, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



ఆటోడ్రైవర్లకు, పారిశుద్ధ్య సిబ్బందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న మల్క కొమురయ్య

కంటోన్మెంట్,జనవరి 27 ప్రభాతవార్త: పేద ప్రజలకు,పారిశుద్ధ్య సిబ్బందికి, ఆటో డ్రైవర్లకు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బిజెపి రాష్ట్ర నాయకులు, పల్లవి ఫౌండేషన్,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యా సంస్థల చైర్మన్ మల్క కొమురయ్య తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్లకు, పారిశుద్ధ్య సిబ్బందికి ఉచితంగా బియ్యం,పప్పులు, మంచినూనె వంటి నిత్యవసర సరుకులను వందలాది మందికి ఉచితంగా పంపిణీ చేశారు.

## చిత్రకళ ఒక మౌనభాష

### ఎమ్మెల్సీ సురభివాణిదేవి




కొండపల్లి శేషగిరిరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభివాణిదేవి

మెహిదీపట్నం, జనవరి 27, ప్రభాతవార్త : చిత్రకళ ఒక మౌనభాష అని, చిత్రకారుడు తన భావాలను చిత్రరూపంలో వ్యక్తం చేస్తాడని ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు. భారత సాంప్రదాయ చిత్రలేఖనంలో అద్భుతాలు సాధించిన గొప్ప వ్యక్తి కొండపల్లి శేషగిరిరావు అని కొనియాడారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని జెఎన్ఏఎఫ్ఏయూ ఆడిటోరియంలో డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు శత జయంతి ఉత్స వాలను పురస్కరించుకొని ఆయన జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సురభివాణిదేవి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిత్రాలలో శకుంతల, దమయంతి, రామాయణం వంటి పురాణాల వివిద సన్నివేశాలు పలువురి ప్రశంసలు అందుకోవడంతో పాటు డాక్టరేట్, హంస అవార్డులను అప్పటి ప్రభుత్వాలు అందించాయని వాణిదేవి తెలిపారు. కొండపల్లి శేషగిరిరావు చిత్రలేఖనాప్రస్థానం అప్రతిహతంగా సాగిందన్నారు. అతని చిత్రాలు నేటికి దేశ పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ, సాలార్ జంగ్ మ్యూజియంలో నేటికి ఉన్నాయన్నారు.కోటిరత్నాల వీణ తెలంగాణలోని వేయిస్తంబాల గుడి ఆరుదైన చారిత్రక కళాసంపదను చాటుకొని ఉన్నటువంటి శిల్పసౌందర్యం, శిల్పక్షేత్రాల, శిల్పకళా సొగసులను సుదీర్ఘ, సునిశిత అధ్యయనంతో తన సొంతం చేసుకోవడంతో పాటు వాటి నుంచి స్ఫూర్తిపొంది కొన్ని వందల చిత్రాలలో ఆశిల్పకళకు దర్పణం పట్టారన్నారు. అనంతరం కొండపల్లి శేషగిరిరావు స్టూడెంట్ ఎక్స్‌లెన్స్-2024 అవార్డులలో భాగంగా చిత్రలేఖనంతో పాటు రంగోళి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు మెమోంటో, ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో జేఎన్ఏఎఫ్ఏయు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కవిత దరియానిరావు, జేఎన్ఏఎఫ్ఏయు రిజిస్టార్ ప్రొఫెసర్ కొడాలి సురేందర్ కుమార్, మాజీ ఐఏఎస్ బి.వి.పాపారావు, ఎమినెంట్ ఆర్టిస్ట్ డాక్టర్ లక్ష్మణ్ ఏలె, గంగాదర్‌రావు, గడప ఆనంద్, నిర్మల, ఏనుగు నర్సింహారెడ్డి, కిషన్ రావు, నారప్ప, కుటుంబ సభ్యులు వేణుగోపాల్‌రావు, నిహారిణి విద్యార్థులు పాల్గొన్నారు.

## 29న రీహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం

**తెలంగాణ ఆరోగ్యశ్రీ మాజీ సీఈఓ డా.చంద్రశేఖర్**

బేగంపేట జనవరి 27,ప్రభాతవార్త : బేగంపేట ప్రకాష్ నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఈ నెల 29న అనంత రీహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలంగాణా ఆరోగ్యశ్రీ మాజీ సీఈఓ డాక్టర్ ఎం,చంద్రశేఖర్ తెలియజేసారు.ఈ మేరకు శనివారం బేగంపేట లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు.ఈ నెల 29న త్రిదండి చిన జీయర్ స్వామి చేతుల మీదుగా అనంత రీహాబిలిటేషన్ సెంటర్ ను ప్రారంభించనున్నట్లు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నగరంలోని వివిధ ఆసుపత్రులకు చెందిన ప్రముఖులైన వైద్యులు పారిశ్రామిక వేత్తలు తదితరులు హాజరు కానున్నట్లు తెలియజేసారు. మన మహా నగరంలో ఉన్న 1.31 కోట్ల మంది జనాభాలో 28లక్షల మందికి అంటే దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరికి జీవితంలో ఏదో ఒక సమయంలో రీహాబిలిటేషన్ సేవలు అవసరం. కానీ ఇప్పుడు 5820పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కొరతను కొంత మేర తీర్చేందుకు అనంత రీహాబిలిటేషన్ పెయిన్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రాన్సిషనల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు సంస్థ సీఈఓ తెలంగాణా ఆరోగ్య శ్రీ ట్రస్ట్ మాజీ సీఈఓ డా,చంద్రశేఖర్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఎస్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు



ఎమ్మెల్యే కెపి వివేకానందను సన్మానిస్తున్న స్థానిక ప్రజలు

నిజాంపేట్, జనవరి 27, ప్రభాతవార్త : తనను గెలిపించిన కుత్బుల్లాపూర్ ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపేందుకు ప్రజా నాయకుడు, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి వివేకానంద చేపట్టిన కృతజ్ఞత యాత్ర శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రగతి నగర్ 25వ డివిజన్ పరిధిలో ముమ్మరంగా కొనసాగింది. తమకు కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చిన ఎమ్మెల్యే వివేకానందకు కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆల్విన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఎన్‌టిఆర్ పార్కు వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ళలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మార్గదర్శకత్వంలో కెటిఆర్ సహాయ సహకారాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామన్నారు. ఈకార్యక్రమంలో నిజాంపేట్ డిప్యూటి మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆల్విన్ మాజీ ఎంప్లాయిస్, సీనియర్ సిటీజన్స్ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్‌ను కెటాయించాలి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మోతె శోభన్ రెడ్డి

తార్నాక, జనవరి 27 ప్రభాతవార్త: పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకొని ఉన్న తనకు సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్ కెటాయించాలని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతెశోభన్ రెడ్డి బయోడేటాను శనివారం తెలంగాణ భవన్‌లో అందజేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి మర్యాదపూర్వకంగా శోభన్ రెడ్డి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తాను పలుమార్లు సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి టికెట్ ఆశించినా తనకు టికెట్ రాలేదన్నారు. మొదటి నుంచి తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసి జైలుకు వెళ్లి వచ్చానని చెప్పారు. పార్టీ అప్పగించిన ప్రతి పనిని తాను చేశానని గుర్తు చేశారు. పార్టీలో ప్రధాన కార్యదర్శిగా, టీటీయూసీ అధ్యక్షునిగా పనిచేశానన్నారు. తొలి ఉద్యమ కారుడనని, అమరుల కుటుంభం నుంచి నాయొక్క అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కేటీఆర్‌ను కోరారు.

## ఉన్నత విద్యామండలి ప్రక్షాళన చేయాలి

**గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌నాయక్, విజయ్‌నాయక్

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త: తెలంగాణలో ఉన్నత విద్యామండలిని ప్రక్షాళన చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం వస్తే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఉద్యమంలో ముందు వరుసలో విద్యార్థులు, నిరుద్యోగులు విశ్వవిద్యాలయాలు వేదికగా పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాల్లో సరైన మౌలిక సదుపాయాలు, నిధులు,నియామకాలు జరగకుండా ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తూ నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నల్గొండ జిల్లాలో మహాత్మాగాంధీ, మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు, నిజామాబాద్‌లో తెలంగాణ, కరీంనగర్‌లో శాతావాహన విశ్వవిద్యాలయాలు నెలకొల్పి ఎస్సీ,ఎస్టీ,బిసిమైనార్టీ పేదవర్గాలకు ఉన్నత విద్య అందించాలనే గొప్ప లక్ష్యంతో ఏర్పాటు చేసి వేలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించిందన్నారు. ఈకార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు సుబ్బు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌నాయక్, ఓయూ జేఏసీ అధ్యక్షులు హనుమంతు నాయక్, ప్రధాన కార్యదర్శి సతీష్‌నాయక్, మౌలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా కులగణన చేయాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య



మారేష్‌ను సన్మానిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త: కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేసి బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లో ఏపీ బిసికమిషన్ మెంబర్‌గా ఎన్నికైన ఆరాష్ట్ర బిసిసంఘం అధ్యక్షులు డా.ఎన్ మారేష్‌ను కృష్ణయ్య ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మారేష్‌కు అవకాశం కల్పించిన సిఎం జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో బిసి ప్రధాని ఉన్నప్పటికీ కులగణనపై వెనకడుగు వేస్తున్నారని బిజెపి పార్టీలో ఉన్న బిసినాయకులంతా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. బిసి కమిషన్ మెంబర్ మారేష్ మాట్లాడుతూ బిసి కమిషన్ ఔనత్యం పెంచేలా కమిషన్ పరిధి దాటకుండా బిసి రిజర్వేషన్లు, బిసిల జీవన స్థితిగతులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివవేదిక ఇస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ,నీల వెంకటేష్, జి.అంజి, రాజేందర్, కోట్ల శ్రీనివాస్, మహేందర్, ఆదిమల్లేశం పటేల్, నందగోపాల్, రాజ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

## గంజాయికి బానిసైన వ్యక్తిపై హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం ఎసిపి శ్రీనివాస్

సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త: చెడు అలవాట్లకు బానిసై గంజాయి, డబ్బుల కోసం వేధించే ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన నలుగురు నిందితుల్లో ముగ్గురిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. శనివారం బాలాపూర్ పిఎస్‌లో మహేశ్వరం ఎసిపి బి.శ్రీనివాస్ ఇన్స్‌పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి, ఎస్ఐ యూసుఫ్ జానిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం బిస్మిల్లా కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ మెహతాబుద్దీన్ చెడు వ్యసనాలకు బానిసై గంజాయి, డబ్బుల కోసం స్థానికులనే కాకుండా తోటి ఆటో డ్రైవర్ ఖదీర్ బారక్బా తండ్రిని వేధించసాగాడు. దీంతో ఖదీర్ పలు మార్లు హెచ్చరించినా మారకపోవడంతో షాహిన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖాలేద్, షేక్ మహ్మద్, షారుఖ్ దగ్గు షేక్ లతో కలిసి శుక్రవారం సాయంత్రం పీర్‌కే మండీ అమీనా మసీదు వద్ద మెహతాబుద్దీన్‌ను అంతం చేయాలని కత్తులు, రాడ్లు, సిమెంట్ ఇటుకలతో దాడులు చేసి ఆ తర్వాత అంతా పారిపోయారు. దీంతో తీవ్ర గాయాలపాలైన మెహతాబుద్దీన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందడంతో రంగంలో దిగిన పోలీసులు నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేసి వారు ఉపయోగించిన కత్తులు, రాడ్లను స్వాధీనం చేసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి రక్తం దానం



రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న శ్రీ ఆయాన్‌ను సత్కరిస్తున్న టీటీఐ ఏసీపీ శంకరరాజు

బేగంపేట జనవరి 27,ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది.ఈ విషయాన్ని తెల్సుకున్న బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ శంకరరాజు తమ సిబ్బందిలో ఎవరికైనా ఓ పాజిటివ్ బ్లడ్ ఉందా అని ఆరాతీసారు.తనది ఓ పాజిటివ్ బ్లడ్ గ్రూపు అని తాను రక్తం ఇస్తానంటూ టీటీఐ కానిస్టేబుల్ మహ్మద్ ఆయాన్ ముందుకు వచ్చారు.వెంటనే సికింద్రాబాద్‌లోని ఎ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్ కు చెందిన పెంజర్ల దేవరాజ్ కు తన వంతుగా రక్తం అందించారు. ఆయాన్‌తో పాటు మరో ముగ్గురు కూడా బాధితునికి రక్త దానం చేయడంతో ఆయన ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు.ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితులలో ఒక వ్యక్తికి రక్తదానం చేసి అతని ప్రాణాలు కాపాడటంలో సహకరించిన కానిస్టేబుల్ మహ్మద్ ఆయాన్ ను బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ శంకరరాజు ఘనంగా సత్కరించారు.

## చిత్తారమ్మ ఆలయంలో అన్నదానం



భక్తులకు అన్నసమారాధన చేస్తున్న కూన శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల, జనవరి 27, ప్రభాతవార్త : గాజులరామారం శ్రీ చిత్తారమ్మ తల్లి జాతర చివరిరోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్‌ను సత్కరించారు. అనంతరం ఆయన చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఆలయ కమిటీ అడ్వైజర్లు శంకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కమిటీ సభ్యులు సత్తయ్య, నర్సింహా, ఆర్.నర్సింహా, పెంటారెడ్డి, సామాజిక కార్యకర్త మల్లేష్, బిజెపి నాయకుడు సదానందం పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొ.కొదండరాంను కలిసిన యునివర్సిటీల వైస్ చాన్సలర్లు



ఎమ్మెల్సీ ప్రొ.కొదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ చాన్సలర్‌లు

తార్నాక, జనవరి 27 ప్రభాతవార్త: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కొదండరాంను తార్నాకలోని ఆయన నివాసంలో రాష్ట్రంలోని ఆయా యునివర్సిటీల వైస్ చాన్సలర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొదండరాంను కలిసిన వారిలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొ.వెంకటరమణ, ఓ.యూ వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ. గోపాల్ రెడ్డి, పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.మల్లేశం తధితరులు ఉన్నారు.

## చెరువు చిన్నబోయింది

గణనీయంగా తగ్గుముఖం పట్టి 5641 ఎకరాలకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. అంటే గత 13 ఏళ్ళ కాలంలో సుమారు 80 శాతం మేర వీటి విస్తీర్ణం తగ్గుముఖం పట్టడం గమనార్హం. ఇందుకు పట్టణీకరణ ప్రభావం ఒక కారణమైతే రెవెన్యూ, పంచాయతీరాజ్, చిన్ననీటి పారుదలశాఖల నిర్లక్ష్యం మరో కారణంగా ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం. నిజాంపేట్, రామంతాపూర్, కోర్‌సిటీ శివార్లు ప్రాంతమేదైనా సరే భారీ వర్షాలు కురిస్తే చాలు చెరువులు, కుంటలకు ఆనుకొని ఉన్న సముదాయాల్లో నివాసితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతకాల్సిందే. జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అపార్ట్‌మెంట్లు, కాలనీల్లోకి చెరువులు తరలిరావడం మనం చేస్తున్నదే. దీనికి ప్రధాన కారణం జలాశయాల గర్భంలోకి నివాస సముదాయాలు చేరడమేనన్నది నిపుణుల మాట.పరిస్థితి తీవ్రంగా ఉన్నా సంబంధిత సర్కారు విభాగాలు కళ్ళు తెరవకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు మహనగరంలో వర్షం కురిసినపుడు నీరు సాఫీగా వెళ్ళే మార్గం లేకపోవడం, వరదనీటి కాల్వల్లో పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలు, వర్షపునీటిని పీల్చుకునే ఏర్పాట్లు లేకపోవడం. చెరువు భూముల్లో భవనాల నిర్మాణం వంటి అంశాలే దీనికి కారణమని గుర్తించారు.సమస్యను పరిష్కరించేందుకు నగరంలో వరద నీటి కాలువల అధ్యయనం, తీసుకోవాల్సిన చర్యలపై కిర్లోస్కర్ కన్సల్టెంట్స్‌కు బాధ్యత అప్పగించారు. కాని ఆ నివేదిక నేటికి అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. నగరంలోని బుల్కాపూర్ నాలా, కూకట్‌పల్లి నాలా, ముర్కి నాలా, పికెట్ నాలా, ఎర్రమంజిల్ నాలా, బంజారాహిల్స్ నాలా, ఎల్లారెడ్డిగూడ నాలా, పంజాగుట్ట నాలా, యూసుఫ్‌గూడ నాలా, నాగమయ్యకుంట నాలా, కళాసిగూడ నాలా, ఇందిరాపార్కు నాల, హుస్సేన్ సాగర్ వరదనీటి కాలువ, మూసి నది ఇరువైపుల ప్రక్షాళన అరకొరగా సాగడం, అక్రమణలకు గురవడంతో వాటికి ఆనుకొని ఉన్న బస్తీలు, కాలనీవాసులు దినదిన గండంగా కాలం గడుపుతున్నారు.

# ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోరా..?

**బేగంపేట ఫ్లై ఓవర్ పైన డివైడర్ ఢీ కొన్న కారు**

**ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు**



బేగంపేట జనవరి 27,ప్రభాతవార్త : బేగంపేట ఫ్లై ఓవర్ పైన శనివారం మరో ప్రమాదం చోటు చేసుకుంది. బేగంపేట వైపు నుంచి పంజాగుట్ట వైపు ప్రయాణిస్తున్న కారు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ని గుర్తించకుండా బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తలకు,కాళ్ళ,చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన వాహన దారులు వారిని సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఒకటి వాహనదారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతుంటే మరోది ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొంటుందో, వెనుక నుంచి వచ్చే వాహనం ఢీకొంటుందోనన్న ఆందోళణ వాహనదారులను వణికిస్తున్నాయి. అలాంటి సంఘటనలే బేగంపేట ఫ్లై ఓవర్ పైన తరచూ చోటు చేసుకుంటుండటంతో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మరికొన్ని సమయాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. బేగంపేట ఫ్లై ఓవర్ పైన బేగంపేట పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ సరిహద్దు (ఫ్లై ఓవర్ పైన) ఉన్న డివైడర్ ప్రమాదాలకు కారణంగా మారింది.ఇక్కడ రెండు రోడ్లు విడిపోయే ప్రాంతంగా ఉంది.ఇదే ప్రాంతంలో రోడ్డుకు తక్కువ ఎత్తులో ఉన్న డివైడర్‌ను వాహనదారులు గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్ని సార్లు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు ఒకదాని వెంట ఒకటి వేగంగా ప్రయాణిస్తుండటం ఒక్క సారిగా రోడ్డు రెండు వైపులా ఉండటంతో ఒక వాహనం వెనుక వైపు వచ్చే వాహనం ముందున్న డివైడర్ ను ఢీకొంటున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో ఇక్కడ ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోగా మరికొందరు తీవ్ర గాయాల పాలయ్యారు.అయినా జిహెచ్‌ఎంసీ,ట్రాఫిక్ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన బేగంపేట మెథడిస్ట్ కాలనీ కుందన్ బాగ్ కు చెందిన వి.శ్రీనివాస్ తనతో పాటు శివ,వంశీ లతో కల్సి వెళుతున్న సమయంలో తన కారు ఈ డివైడర్ ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో అతను ప్రాణాలతో బైటపడ్డాడు.కారు పూర్తిగా దెబ్బతింది. తాజాగా శనివారం సాయంత్రం గం 4.30ల సమయంలో బేగంపేట వైపు నుంచి పంజాగుట్ట వైపు వెళుతున్న ఓ కారు ప్రమాద వశాత్తు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ను ఢీకొట్టడంతో కారులో ఉన్న ఓ వ్యక్తికి తలకు కాళ్ళ,చేతులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం.ఇది గమనించిన మరికొందరు వాహనదారులు వెంటనే స్పందించి అతన్ని సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించినట్లు తెల్సింది.ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ,ట్రాఫిక్ అధికారులు ఇక్కడ డమ్మీ పోలీస్ బొమ్మను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించి వాహన దారుల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కాళీ కాలభైరవ కల్యాణంతో సమాజంలో అరిష్టాలు తొలుగుతాయి

**తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్**

**కోటి ప్రత్యంగిరా మహాయజ్ఞంలో పాల్గొన్న**

**తెలంగాణ డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

ముషీరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త: కాళీ కాలభైరవ కళ్యాణంతో సమాజంలోని అరిష్టాలు తొలిగిపోతాయని తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్ అభిప్రాయపడ్డారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి 88వ జన్మదినం సందర్భంగా కొనసాగుతున్న కోటి ప్రత్యంగిరా మహాయజ్ఞంలో భాగంగా చేపట్టిన కాళభైరవ కళ్యాణంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఎండుమిరపకాలతో చేస్తున్న యాగంతో అన్ని అరిష్టాలను పారద్రోలి, మంచిని పెంపొందిస్తుందని అన్నారు. డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించటానికి కుర్తాళం సిద్ధేశ్వర పీఠం చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిధులకు జ్ఞాపికలు అందచేశారు. స్వామి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి చేసిన అనుగ్రహ భాషణంతో భక్తులు భక్తి భావంతో పరవసించిపోయారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం చేసిన కళాకారులను అతిధులు సత్కరించారు. ఈ కార్యక్రమాలలో రమ్యానంద భారతిస్వామి, కో ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషన్ తదితరులు పాల్గొన్నార

## ఉప్పల్ టెస్టుకు పోటెత్తిన అభిమానం



కూడా ఐపిఎల్ తరహాలో ఫ్యాన్స్ పోటెత్తుతున్నారు. తొలిరోజు ఆటకకు సుమారు 24వేలమంది స్టేడియంకు రాగా, రెండోరోజు ఆటకు ఏకంగా 30వేల 886మంది, మూడోరోజు 30వేల 569మంది హాజరవ్వడంతో గత రికార్డులన్నీ తుడిచి పెట్టుకుపోయాయి. స్కూల్ స్టూడెంట్లు, ఆర్మీ, నేవీ, వైమానిక దళానికి హెచ్‌సిఏ ఉచిత ప్రవేశం కల్పించడంతోపాటు మ్యాచ్ నిర్వాహణపై విస్తతంగా ప్రచారం చేయడంతో స్టేడియం జనసంద్రంగా మారింది. ఈసందర్భంగా స్టేడిదానికి విచేస్తున్న అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు హెచ్‌సిఏ అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు స్వయంగా మైదానంలోని అన్ని స్టాండ్లను తనిఖీ చేశారు. ఒకదగ్గర సమోసాలు అధికధరకు విక్రయిస్తున్నారని తెలిసి అతడిని హెచ్చరించి అతడిని బయటికి పంపించేశారు. ఆతర్వాత సాయిధ దళాల ఉద్యోగులు, వారి కుటుంబాల దగ్గరకు వెళ్లి సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ స్టూడెంట్ల వద్దకు వెళ్లి ఉచిత భోజనం సరిగ్గా అందుతుందో లేదో పిల్లల్ని అడిగి తెసుకున్నారు. వారంతా సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ప్రత్యక్షంగా మ్యాచ్ చూసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాచకొండ కమిషనరేట్ పరిధిలో 25 మంది ఇన్స్‌పెక్టర్ల బదిలీ

### మరో ఆరుగురు ఎస్సైలు

నేరేడ్‌మెట్ జనవరి 27 ప్రభాతవార్త: రాచకొండ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్స్‌పెక్టర్ల బదిలీలు శనివారం జరిగాయి. ఒకే సారి 25 మంది ఇన్స్‌పెక్టర్లు, ఆరుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. గతకొంత కాలంగా తరచు వార్తల్లో నిలుస్తున్న చైనత్య పురి పీఎస్ ఎస్‌హెచ్‌వోగా జీ.వెంకటేశ్వర్లును నియమించారు. బొమ్మలరామారాం ఎస్ఐగా ఉన్న జీ.శ్రీనివాస్ రెడ్డిని చైతన్య పురి పీఎస్‌కు బదిలీ చేశారు. అదేవిదంగా హయత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓగా వెంకటేశ్వర్లును మహేశ్వర్ల పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.పిసీఆర్‌గా విధులు నిర్వహిస్తున్న సందీప్ కుమార్‌ను నేరేడ్‌మెట్ ఎస్‌హెచ్‌వోగా, చౌటుప్పల్ రూరల్ అటాచ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.మహేష్‌ను కుషాయిగూడా ఎస్ఎచ్ఓగా బదిలి చేశారు.ఎస్‌ఓటీ...1గా విధులు నిర్వహిస్తున్న ఎ.రాములు సీసీఎస్ యాదగిరి గుట్ట అటాచ్‌టూ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న పి.గౌరా రెడ్డి పహాడిషరీఫ్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. హయత్‌నగర్ ఎస్ హెచ్‌వోగా ఉన్న హె. వెంకటేశ్వర మహేశ్వరం ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. సీటీసీ ఇన్స్‌పెక్టర్ ఎండి. మహబూబ్ జానీ కందుకూర్ ఇన్స్‌పెక్టగా బదిలీ అయ్యారు. కందుకూర్ ఇన్స్‌పెక్టర్ గా ఉన్న ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి ఎస్‌బీకి బదిలీ అయ్యారు. రామన్నపేట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గా ఉన్న సిహెచ్. మోథిరామ్ సీసీఎస్ మల్కాజిగిరికి బదిలీ అయ్యారు. సీసీఎస్ ఎల్‌బీనగర్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఎన్.వెంకటేశ్వర్లు రామన్నపేట్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. విఆర్ ఇన్స్‌పెక్టర్ గా ఉన్న జి.వెంకటేశ్వర్లు చైతన్యపురి ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. సిసిఎస్ ఎల్‌బీనగర్ ఇన్స్‌పెక్టర్ జి.గోవర్ధన గిరి ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. అయన స్థానంలో ఎం.మహేందర్ రెడ్డి సైబర్ క్రైంకు బదిలీ అయ్యారు. ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ టి. వేణుగోపాల్ రావు యాదగిరి గుట్ట సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఎస్.రాఘవేందర్ రెడ్డి అదిబట్ల ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఎస్‌వోటీ ఇన్స్‌పెక్టర్ ఉన్న వి.అశోక్ రెడ్డి చౌటుప్పల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన డి.దేవేందర్ షీటీం కు బదిలీ అయ్యారు. సైబర్ క్రై ఇన్స్‌పెక్టర్ ఎం. ప్రభాకర్ రెడ్డి భువనగిరి రూరల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. భువనగిరి టౌన్ పిఎస్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.సుధీర్ కృష్ణ ఎల్‌బీనగర్ ట్రాఫిక్...2 ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సిహెచ్. జితెందర్ రెడ్డి పిసిఆర్‌కు బదిలీ అయ్యారు. హయత్‌నగర్ డిఐగా ఉన్న ఆర్.నిరంజన్ ఎస్‌ఓటీ..1గా బదిలీ అయ్యారు. విఆర్ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న ఆర్ బాబయ్య నాయక్ మంచాల్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ బి.సురేష్ కుమార్ భోన్‌గిరి టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆదిబట్ల ఇన్స్‌పెక్టర్ గా ఉన్న పి.రఘువీర్ రెడ్డి కుషాయిగూడా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్...1 బీ బదిలీ అయ్యారు. అదేవిదంగా మేడిపల్లి డిఐగా ఉన్న బి.ఉపేందర్ రావు భువనగిరి ట్రాఫిక్ 2కు బదిలీ అయ్యారు. ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న పి.సైదులు ఎస్‌ఓటీ ...2గా బదిలీ అయ్యారు.

## తెలంగాణ ఉద్యమంతోనే తెలుగుతల్లి విగ్రహాన్ని స్థాపించం : జంపన,జె.ఎం.ఆర్.



బోయిన్‌పల్లిలో తెలుగుతల్లికి నివాళులర్పిస్తున్న జంపనప్రతాప్

కంటోన్మెంట్, జనవరి 27 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద తెలుగుతల్లి విగ్రహం స్థాపించి 14 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శనివారం తెలుగుతల్లి విగ్రహానికి కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డిలు పాల్గొని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు వీరా రెడ్డి, ప్రభుదాస్, ప్రభుగుప్త, ప్రభుగౌడ్, షకీబ్,షిరాజ్, అజిత్, పవన్,మౌలా, దఫేదార్ గణేష్‌లు పాల్గొన్నారు.

## ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో వస్త్ర ప్రదర్శన

హైదరాబాద్, జనవరి 27,ప్రభాతవార్త: ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌లో స్వాన్‌ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ వస్త్ర ప్రదర్శన షురూ అయ్యింది. ఈమేరకు శనివారం ఫిలింనగర్‌లోని కల్చరల్ సెంటర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ ఆధునిక సంప్రదాయ మేళవింపు కలగలిపిన వస్త్ర ప్రదర్శనను టాలీవుడ్ నటి రాషిసింగ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాషన్‌డిజైనర్లు, మహిళా వ్యాపార వేత్తల వస్త్రోత్పత్తులు ఒకేవేదికలో ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. ఇక్కడి ప్రదర్శనలో ఉంచిన హ్యాండ్‌లూమ్, సిల్క్‌తోపాటు విభిన్న రకాల ఉత్పత్తులు ఎంతో ఆకట్టుకునే విధంగా ఉన్నాయన్నారు. ఔత్సాహిక మహిళా ఫ్యాషన్ డిజైనర్లు, మహిళా పారిశ్రామిక వేత్తలు వేలాది మంది సమకాలీన, సాంప్రదాయ చేనేత చీరలు, పట్టు,డిజైనర్ దుస్తులు, ఆభరణాలు, లైఫ్‌స్టైల్ ఉపకరణాలు గృహాలంకరణలు వంటి మరెన్నో ఇక్కడ కొలువుదీరాయని ఈప్రదర్శన ఆదివారం రాత్రి వరకు ఉంటుందని నిర్వాహకులు అంజలిరెడ్డి, స్వామి వేముల తెలిపారు.

## పీజీ కళాశాలలో సమస్యలు తెలుసుకున్న వైస్ చాన్సలర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్, రిజిస్టార్ ప్రొ.లక్ష్మీనారాయణ తదితరులు

తార్నాక, జనవరి 27 ప్రభాతవార్త: సికింద్రాబాద్ పీజీ కళాశాలలోని మహిళా వసతి గ్రహంలోకి దుండగులు వచ్చిన నేపథ్యంలో హుటాహుటిన ఓ.యూ వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్, రిజిస్టార్ ప్రొ.లక్ష్మీనారాయణ శనివారం కళాశాలకు చేరుకున్నారు. యూనివర్సిటీ అధికారులతో కలిసి పీజీ కళాశాల మొత్తం కలియతిరిగారు. అనంతరం విద్యార్థులతో సమావేశం అయ్యారు. మరో సారి ఇలాంటి ఘటనలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని విద్యార్థులకు హామి నిచ్చారు. విద్యార్థినుల భద్రత కోసం వసతి గృహం చుట్టు పది అడుగుల ఎత్తులలో గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామినిచ్చారు. పూర్తి స్థాయిలో సీసీ కెమెరాల ఏర్పాటు, మెస్, వసతి గృహాల్లో ఉన్న విద్యార్థి సంక్షమ వ్యవహారాల డీన్ ప్రొ. రాజేంద్ర నాయక్, ప్రొ.నవీన్‌కుమార్, చీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్, డా.కళ్యాణ లక్ష్మి సహ ఆయా విభాగాల బాధ్యులు, అధ్యాపకులు విధ్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభిమాని ఫణిభార్గవ్ యాదిలో

చిక్కడపల్లి, జనవరి 27, ప్రభాతవార్త: యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని ఫణిభార్గవ్ యాదిలో కార్యక్రమం శనివారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగింది. ప్రముఖ కవి డాక్టర్ ఎం.కే.రాము అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రముక సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నేత్ర వైద్యులు డాక్టర్ వి.లత, ప్రముఖ సంపాదకులు కే.రామ చంద్ర, గానసభ అధ్యక్షులు కళాజనార్ధన్‌మూర్తి, ఫణి భార్గవ్ తండ్రి రమణ తదితరులు పాల్గొ న్నారు. ఫణిభార్గవ్ జ్ఞాపకార్థం విద్యార్థిని సడియా బేగంకు ఆర్థిక సాయం అందచేశారు.

## ఆర్య వైశ్యులందరు సేవాభావంతో ముందుకు సాగాలి

చిక్కడపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: ఆర్యవైశ్యులందరు సేవాభావంతోముందుకు సాగాలని ఆల్ ఇండియా నెంబర్ వన్ చీఫ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ అడ్వైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా

## ఉప్పల్ కారిడార్ త్వరగా పూర్తి చేయాలని మంత్రికి వినతి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ప్రధాన రహదారి లో సగంవరకు రోడ్డు తవ్వి వదిలివేయడంతో ట్రాఫిక్‌తో ఇబ్బందులు వస్తు న్నాయన్నారు. కారిడార్ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా సర్వీసు రోడ్డు వెంట కొత్త రోడ్డు వేయాలని, దుకాణదారులు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, సాయిజెన్ శేఖర్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గంపై బిజెపి జెండా ఎగురవేస్తాం: శంకర్‌రెడ్డి



ఎంపి ఎన్నికల సన్నాహక సమావేశంలో కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త:** చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గంపై భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో జరిగిన చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ ఎని ్నకల బిజెపి సన్నాహక సమావేశానికి ఆయన పలువురితో కలిసి తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 2019లో మాదిరి గానే తిరిగి బిజెపి అనుకూల పవనాలు వీస్తున్నాయనీ దీని ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై ఉంటుందని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎవ్వరూ ఊహించని రీతిలో బిజెపికి భారీ అధిక్యత వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో బిజెపిని గెలిపించడానికి పార్టీ శ్రేణులు సమరోత్సా హంతో సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సమావేశానికి తరలివెళ్ళిన వారిలో బిజెపి నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, గాజుల మధు, కోడూరు సోమేశ్వర్, వల్లభోజు గోపినాథ్, పసునూరి బిక్షపతిచారి, కీసర హరినాథ్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, జెడి కుమార్, భీంరావులతో పాటు పలువురు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతోమేలు : లక్ష్మణ్




వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కౌన్సిలర్ లక్ష్మణ్

**హయత్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త:** పేదప్రజలు నివాసముండే కాలనీలు, బస్తీలలో కార్పొరేట్ ఆసుపత్రులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పెద్దఅంబర్‌పేట 12వ వార్డు కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ అన్నారు. కుంట్లూర్ గ్రామపరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3 భూపోరాట కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి ఫౌండే షన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభిం చిన లక్ష్మణ్ మాట్లాడుతూ...కార్పొరేట్ ఆసుపత్రులు సామాజిక బాధ్యతగా వైద్యసేవా కార్యక్రమాలను నిర్వహించడం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు బీపీ, షుగర్‌తో పంటి, కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ అధ్యక్షుడు దాసరి ప్రసాద్, నాయకులు చిలుకూరి పుల్లయ్య, దూపం నిరంజన్, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం : డిఇ సురేష్



వినియోగదారుల సమస్యలను పరిశీలిస్తున్న డిఇ సురేష్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 27 ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చంపాపేట డివిజన్ విద్యుత్ శాఖ డిఇ పెద్దింటి సురేష్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను డిఇ సురేష్ ఆధ్వర్యంలో అధికారు లు, సిబ్బంది తొలగించారు. అదేవిధంగా వనస్థలిపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది కలిగిస్తున్న పలు చెట్లకొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరాను అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారుల కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం విజయవాడకు చెందిన పలు వురు కళాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కూచిపూడి కళాకారులు జంగం మనీషా చక్రవర్తి, జంగం శిరీషా శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. పూర్వ రంగం గజాననయువతం, కళింగ నర్తన, శృంగార లహరి, బృందావనం నిలయేహ్, దశావతారాలు, శివాష్టకం, శివస్తుతి, జత్వి స్వరం, కృష్ణశబ్దం తదితర అంశాలను జంగం మనీషా, శిరీష, పూజిత, తన్మయ, మౌనిక, చరిస్మా, సాత్విక తదితరులు తమ ప్రద ర్శనలతో ఆకట్టుకున్నారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.

## జిల్లెలగూడ పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం : ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డి



రూ.6 లక్షల విరాళం చెక్కును అందజేస్తున్న ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గ్రామస్తుల ఆధ్వర్యంలో పునర్నిర్మాణం జరుగుతున్న పురాతన మైన పోచమ్మఆలయానికి తనవంతు విరాళంగా చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి రూ.6 లక్షల విరాళాన్ని అందజేశారు. జిల్లెలగూడ ప్రధానరోడ్డులో ఉన్న పురాతన ప్రధాన పోచమ్మ అమ్మవారి దేవాలయాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ కమిటీ ఆధ్వర్యంలో భవ్యమైన దేవాలయంగా నిర్మిస్తున్న సంగతి విదితమే. అయితే గ్రామ పెద్దలు, కమిటీ విజ్ఞప్తి మేరకు ఎంపి రంజిత్‌రెడ్డి విరాళాన్ని ప్రకటించి దానికి సంబంధించిన రూ.6 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్ రెడ్డి, సిద్దాల దశరథ, బొబ్బిలి కిరణ్‌గౌడ్, కొత్త జనార్ధన్‌రెడ్డి, కుంటల సదానంద్‌గౌడ్, సప్పిడి యాదిరెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కొత్త మధుసూదన్‌రెడ్డి, మల్లెల నరేందర్‌రెడ్డి, బొక్క అంజిరెడ్డి, సప్పిడి జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని మరింత బలోపేతం చేయాలి : బిఎల్ఆర్

**ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీని మరిం త బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నేతలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ డివిజన్ నుంచి భారీ మెజార్టీ వచ్చిందని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ మరింత మెజార్టీ సాధించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పల్ డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నేతలు పోగుల దయాకర్‌రెడ్డి, అరటికాయల భాస్కర్, పి.జితేందర్‌రెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి, అన్య బాలకృష్ణ, వి.సంతోష్‌రెడ్డి, చింతల నరసింహారెడ్డి, కొంద్రు హనుమంతు, పంగ రాజేశ్వర్, వర్కల రాజేందర్, టంటం వీరేష్, సోమిరెడ్డి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## శ్రేష్ఠశ్రీ కమల ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన : డాక్టర్ ప్రవీణ్



శ్రేష్ఠశ్రీ కమల ఆసుపత్రిలో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ్

**మలక్‌పేట, జనవరి 27 ప్రభాతవార్త:** దిల్‌సుక్‌నగర్‌లోని శ్రేష్ఠశ్రీ కమల ఆసు పత్రిలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, ఎం.డి. డాక్టర్ బాలాజీ ప్రసాద్ రామ్‌శెట్టిల ఆధ్వర్యంలో వెల్‌నెస్ ఫ్రీడమ్ క్యాంప్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో రూ. 6 వేల విలువగల ఫైబ్రోస్కాన్ లివర్ టెస్ట్‌ను ఉచితంగా నిర్వహించడంతోపాటు ఇసిజి, జిఆర్‌బిఎస్, సిబిపి పరీక్షలు, ఉచిత డెంటల్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా జనరల్ మెడిసిన్, డెంటల్ స్పెషలిస్ట్, ఆర్థోపెడిక్స్‌పై ఉచిత కన్సల్టేషన్ అందించడం జరిగింద న్నారు. సుమారు 200ల మందివరకు ఈ శిబిరంలో చికిత్సలు చేయించుకు న్నారని తెలిపారు. కార్యక్రమంలో డెంటల్ సర్జన్ డాక్టర్ కిరణ్, ఆర్థోపెడిక్స్ విభాగం డాక్టర్ కిషోర్, హెచ్ఓడి ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ

**కుషాయిగూడ, జనవరి 27 ప్రభాతవార్త :** మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ తెలిపారు. కుషాయిగూడ సబ్ స్టేషన్ కుషాయిగూడ లెవెన్ కె.వి లీడర్ పరిధిలోని నార్త్ కమలానగర్ కుషాయిగూడ విలేజ్ ఇండస్ట్రియల్ ఏరియా లలో ఆదివారం ఉదయం 10:30 నుండి 12:30 వరకు మరమ్మత్తుల కార ణంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా పద్మావతి టెంపుల్ లెవెన్ కె.వి ఫీడర్ పరిధిలో కోర్ట్ ఏరియా ఇండస్ట్రియల్ ఏరియా పద్మావతి కాలనీ కమలా బిల్డర్స్ పోచమ్మ టెంపుల్ కుషాయిగూడ మెయిన్ రోడ్ ప్రాంతాలలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల 30నిమిషాల నుండి సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అసౌకర్యా నికి వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.



చైతన్యపురి డివిజన్‌లోని బాబు కాంప్లెక్స్, ఇందిరానగర్, భవానినగర్‌ల లో సుమారు రూ.30 లక్షలతో జరుగుతున్న కొత్త రోడ్లు, యుజిడి లైన్స్ పనులను కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో అధికారులు రవీందర్‌రెడ్డి, సాయికుమార్, సురేందర్, శ్రీకాంత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. (ప్రభాతవార్త, హైదరాబాద్)

## సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం : ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న తదితరులు

**హయత్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త:** పసుమాములలోని శ్రీసీతారామ చం ద్రస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సంపూర్ణ సహకారం అందిస్తానని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవులస్వప్న అన్నారు. రామగిరి గుట్టకింది నుంచి రామలయం వరకు 30 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ ఆవరణలో సదుపాయాల కల్పనకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోతె మణెమ్మ, కో-ఆప్షన్ సభ్యులు శంకరయ్యగౌడ్, మాజీ సర్పంచి కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, డీఈఈ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

**గతేడాది 24.78 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు...**

మున్సిపాలిటీపరిధిలో గతేడాది మొత్తం 24.78 కోట్ల రూపాయలతో అభివృ ద్ధి పనులను చేపట్టినట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు. పాలకవర్గం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయంలో ఆమె వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్లతో కలిసి కేకును కోశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2023లో సీసీరోడ్లకు 14.58 కోట్లు, డ్రైనేజీ పనులకు 6.81 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు 3.39 కోట్ల రూపా యలను ఖర్చు చేసినట్లు తెలిపారు. మొత్తం 502 పనులలో 373 పనులు పూర్తికాగా 129పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. పెద్ద అంబర్‌పేటనుంచి పసుమాములవరకు డ్రైనేజీ ట్రంక్‌లైన్‌కోసం 6కోట్ల రూపాయలను కేటాయిం చినట్లు తెలిపారు. అంబర్‌పేటనుంచి పసుమాములవరకు హెచ్ఎండీఏ నిధు లు 4.50కోట్ల రూపాయలతో బీటీరోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఏడాది కాలంలో మిగిలిఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు.

## కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించిన వారికి కృతజ్ఞతలు: మేయర్ పారిజాత



కేకు కట్ చేస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ శేఖర్, కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, జనవరి 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అందరి సహకారంతో గడచిన నాలుగు సంవత్సరాల్లో అభివృద్ధి చేశామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దావూద్‌ఖాన్ గూడలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నూతన భవనం లో పాలకవర్గం పదవీ కాలం నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కాలంగా కార్పొరేషన్ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా నాలుగు సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యు లను కమీషనర్ సుమన్‌రావు శాలువాలు, బొకేలతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ బడుగు సుమన్‌రావు, ఫ్లోర్ లీడర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఏర్పడుతుందని ఎఇ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ శాంతినగర్ పీడర్ పరిధిలో శాంతినగర్, విజయపురికాలనీ, బాలాజీ నర్సింగ్‌హోమ్, ఉప్పల్ ప్రధానరహదారి, హనుమసాయికాలనీ తదితర ప్రాం తాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 11 కెవి ఆర్‌టిఎ కార్యాలయం పీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎండిఏ పీడర్ పరిధిలో భగాయత్ ఏరియాలో సాయంత్రం 3.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**రామంతాపూర్‌లో...** రామంతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విశాల్ పీడర్ పరిధి లోని రాఘవేంద్ర టెంపుల్, పాలిటెక్నిక్ తదితర ప్రాంతాల్లో 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ట్లు ఎఇ రాములు తెలిపారు. విశాల్ మార్ట్, గంగా, యమునా, సరస్వతి బ్లాక్, గణేష్‌నగర్, పిఎస్ కాలనీ,గోఖలేనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. 11కెవి చర్చికాలనీ పీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 14.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపార. ఇందిరానగర్, నెహ్రునగర్, సత్యనారాయణస్వామి దేవాలయం, ఆనంద్‌నగర్, పాజిజాత స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## పవర్ లిఫ్టింగ్‌లో ఉప్పల్ విద్యార్థి ప్రతిభ




నిర్వహకుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రణయ్‌రాజ్

**ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త :** డబ్ల్యుపిసి తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ చాంపియన్ పోటీలలో ఉప్పల్‌కు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రధమ స్థానం సాధించారు. నగర శివారులోని కొల్లూరులో జరిగిన విడిఎల్ పిట్‌నెస్ సోల్యూషన్స్‌లో డబ్ల్యుపిసి తెలంగాణ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో ఉప్పల్ శేషసాయినగర్‌కాలనీకి చెందిన జోన్నపల్లి క్రాంతిరాజు కుమారుడు ప్రణయ్ రాజ్ రాష్ట్ర స్థాయి పోటీలలో టిన్‌త్రీ అండర్ -60 కేటగిరి డెడ్‌లిఫ్ట్‌లో 140 కిలోలు, బెంచర్ ప్రెస్‌లో 64కిలోలు, పుష్‌పుల్‌లో 205కిలోల బరువు ఎత్తి ప్రధమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా డబ్ల్యుపిసి రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ మాట్లాడుతూ పోటీలలో విజయం సాధించిన వారు త్వరలో జరిగే జాతీయపోటీలలో పాల్గొంటారని తెలిపారు. ప్రధమ స్థానంలో నిలిచిన ప్రణయ్‌రాజ్ మాట్లాడుతూ స్థానిక ద్వారాకనగర్‌లోని స్లిమ్ లయన్ పిట్‌నెస్ జిమ్ కోచ్ అశోక్ వద్ద తాను శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు పలువురు కోచ్‌లు తెలిపారు.

## పైప్ లైన్ పనుల నిర్మాణాల కోసం నిధులు మంజూరు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వాటర్ వర్క్స్ ఎండి సుదర్శన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 27 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మెట్రో వాటర్ వర్క్స్ ఏండి సుదర్శన్ రెడ్డిని శనివారం కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో దాదాపు 80 కిలో మీటర్ల మేర నూతన వాటర్ పైప్ లైన్స్ మంజూరు చేయడం జరిగిందని, దానికి తోడుగా మరో 18 కిలోమీటర్ల మేర అదనపు వాటర్ పైప్ లైన్స్ మంజూరు చేయాలని కోరారు. శివారు ప్రాంతాల్లో ఉన్న వారికి ఎంతో మేలు చేసినట్టు అవుతుందని తెలిపారు. శివారు ప్రాంతాల అభివృద్ధి కోసం నూతన యూజీడి డ్రైన్స్ మంజూరు చేయాలని సుధీర్ రెడ్డి కోరారు. ఆయా పనుల కోసం సుమారు రూ.40కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. అందు కు స్పందించిన ఏండి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా మరో 18 కిలోమీటర్ల నూతన వాటర్ లైన్స్ మంజూరు చేస్తామని తెలిపారు. నూతన యూజీడి లైన్స్ కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఉప్పల్ అభివృద్ధికి నిధులు కేటాయించండి




కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను వినతి పత్రం అందజేస్తున్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, జనవరి 27 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కి నిధులు కేటాయించాలని కాం గ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచా ర్జీ మందములపరమేశ్వర్‌రెడ్డి శని వారం గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ నియో జకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు. కాలనీ లు, మురికివాడలలో సిసిరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, శ్మశానవాటికలు, పార్కుల సుందరీకరణకు నిధులు ఇవ్వాలని సూచించారు. పనులకు కావాల్సిన నిధు లు కేటాయించి పనులను చేపట్టాలని ఆయన కోరారు. పెండింగ్ పనులపై కమిషనర్ సానుకూలంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



కార్పొరేటర్ భాగ్యలక్ష్మికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**మలక్‌పేట, జనవరి 27 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహ కుడు డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతోగానో దోహద పడతాయన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఉచిత శిబిరంలో పలు రకాల వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహించడంతోపాటు వైద్యుల సలహాలు, సూచ నలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి జయప్రకాష్, రామినేని భూలోకరావు, రామినేని రవీందర్, బాల్తు శ్రీనివాస్, రామినేని వెంకటేశ్వర్లు, నల్లపు రాజ్‌కుమార్, మేకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి: కార్పొరేటర్ పవన్‌కుమార్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్

**హైదరాబాద్, జనవరి 27 ప్రభాతవార్త:** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. భరత్‌నగర్ కాలనీ ఫేస్2లో శనివారం కార్పొరేటర్ పర్యటించా రు. కాలనీలో నూతన డ్రైనేజ్ లైన్ పనులు ప్రారంభం కావడంత జలమండలి అధికారులు అరిఫ్, దయాకర్, కాలనీ వాసులతో కలిసి డ్రైనేజ్ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరత్ నగర్ కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సరైన లెవెల్స్ చూసుకోవాలని, డ్రైనేజ్ లైన్ పనులు తొందరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచిం చారు. కాలనీలో ఏదైనా సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాల న్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామ చందర్, ఆకుల వెంకటేష్, సైదులు, రాజు, దుర్గేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నూతనంగా గవర్నర్ కోటలో తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ కోదండరాం ఎమ్మెల్సీ ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామలతో కలిసి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం (ప్రభాతవార్త, తుర్కయాంజాల్)